విశ్లేషణ :

'అతడుం - ఆమెం' - జాతీయోద్యమం

కె. బాలగోపాల్

ఒక సామాజిక విషయాన్ని అర్థంచేసుకోవడానికి అది సజీవంగా ఉంటే చాలా సౌకర్యం. లేకపోతే దాన్ని గురించిన అభిప్రాయాలు మాత్రమే మనకు దొరుకుతాయి. ఈ అభిప్రాయాలు రకరకాల అవసరాల కోసం, రకరకాల ఒత్తిడులతో, రకరకాల జ్ఞాపకాలతో ఏర్పరచుకునేవి కావడంవల్ల అవి వాస్తవానికి సాధారణంగా ఎంతో కొంత వక్రీకరణలే కాగలవు. అందుకే చరిత్ర రచన అంత కష్టం.

మన జాతీయోద్యమాన్ని తీసుకోండి. జాతీయోద్యమం అనగానే మన కివ్వాళ కాంగ్రెస్ పార్టీ గుర్తుకొస్తుంది. కాని ఆనాడు కాంగ్రెస్ పార్టీ నడిపిన ఉద్యమమే జాతీయోద్యమమని ప్రజలంతా అనుకోలేదు. ఆ అభిప్రాయాన్ని తరువాతి కాలంలో మనకు బలవంతంగా కలిగించారు. కాంగ్రేసేతర పార్టీలూ సంస్థలూ ఉద్యమాలూ చేసిన కృషిని 'విజేతల చరిత్ర 'మింగేసింది.

పోనీ జాతీయోద్యమంలో కాంగ్రెస్ పాత్రను తీసుకోండి. దీన్ని ఇవ్వాళ అర్థం చేసుకోవడం చాలా కష్టమయిపోయింది. ఆనాడు ప్రజలలో వివిధ వర్గాలు కాంగ్రెస్‌ను గురించి, గాంధీని గురించి, నిజంగా ఏమనుకున్నారో, ఏ వైఖరితో వాళ్ల ఉద్యమాలలో పాల్గొన్నారో, మనకివ్వాళ అంతు చిక్కడం సమస్య అయింది. దేశమంతా ఉద్యమ ఉత్సాహంతో అట్టుడికిపోయి (నిజంగా అట్టుడికి పోయారో లేదో— ఇదిగూడ మనకు కాంగ్రెస్ వారు చెప్పిన చరిత్రే) ప్రజలు ఇల్లూ వాకిలి సంసారం వదిలిపెట్టి బయటకు వస్తూన్న సందర్భంలో చౌరీచౌరాలో 'దౌర్జన్యం' జరిగిందని ఉద్యమాన్ని గాంధీ విరమించుకున్నప్పుడు జనం నిజంగా ఏమనుకున్నారు? మహాత్ముడనుకున్నారా, వెర్రివాడనుకున్నారా, బహుశా బ్రిటిష్ ఏజెంటేమోనన్న అనుమానం గూడ కలిగిందా? (ఎవ్వరికీ ఈ అనుమానం కలగలేదంటే నమ్మడం కష్టం). కొన్నేళ్ల తదుపరి స్వరాజ్యం కోసం మళ్లీ ఉద్యమాన్ని ఆహ్వానించి ఏం చేయమంటాడో అని అందరూ ఆతృతతో ఎదురు చూస్తూ వుండగా ఉప్పు తయారు చేయమని గాంధీ అన్నప్పుడు - అప్పుడు జనం ఏమనుకున్నారు? రాజకీయ వ్యూహాన్ని ఎత్తుగడలనూ రూపొందించవలసిన సమయంలో రాట్నం వడకమని ఆదేశించినప్పుడు, జనాన్ని పోనీండి కాంగ్రెస్ కార్యకర్తలు సహితం ఏమనుకోలేదూ?

మనకు తెలీదు. 1947 తరువాత రూపొందిన అధికార అభిప్రాయాలు మాత్రమే మనకు తెలుసు. 1947 తరువాత కాంగ్రెస్ వారి జాతీయోద్యమం వీధుల నుండి పాఠశాలలలోకివచ్చింది. పాఠ్యపుస్తకాలలో గ్రంథస్తమై కూర్చుంది. అంతకు ముందు ఒక్కొక్క సమయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం, అవలంబించిన వ్యూహం, ఆనాడు ప్రజల కళ్లకు ఏవిధంగా కనబడ్డాయోగాని ఈ పాఠ్య పుస్తకాలలో అవి చాలా అనివార్యమయిన నిర్ణయాలుగా వర్ణించబడతాయి. వాటి విజ్ఞతను ఆనాడు ప్రజలలో కొందరయినా ప్రశ్నించారేమోనన్న అనుమానం మనకు రానివ్వరు. ఎంతో ముందు చూపుతో, తరచి తూచి తీసుకొన్న నిర్ణయాలుగా వర్ణింపబడతాయి. ఆ నిర్ణయాలే చరిత్రను నడుపుతాయి.

రానురాను, పాత కాంగ్రెస్ నాయకులు గతించే కొద్దీ ఈ పురాణం కరిగి పోవలసింది పోయి మరింత కరడుగడుతోంది. నిన్నటి వరకు కేవలం జాతిపిత అయిన గాంధీ ఇప్పుడొక ప్రవక్తగాను, సామాజిక విప్లవతత్వవేత్తగాను, ఋషి గాను మారుతున్నాడు. ఈ పరిణామానికి కర్తలు పాత గాంధేయులు కారు. కృపలాని కాదు, జయప్రకాష్ కాదు, వినోబాకాదు, ప్రకృతి చికిత్సలో నిపుణులయిన మొరార్జీ గాని ప్రభుదాస్ పట్వారిగాని కారు. ఈ మార్పును సాధిస్తున్నది కొత్తతరానికి చెందిన కొత్త గాంధేయులు. వీళ్లలో ప్రముఖులు అరుణ్ శౌరి, ఆశీశ్ నంది, క్లాడ్ ఆల్వారస్. (గాంధీగారి మనమలలో ఒకడయిన రాజ్‌మోహన్ గాంధిని గూడ వీళ్లతో చేర్చవచ్చును గాని, పితరులను దైవసమానులుగా భావించడం భారతీయ సంప్రదాయమే కాబట్టి ఇతన్ని గూడ ఈ కోవలో చేరిస్తే ఇక వీళ్ల వేపు పిండం గూడ పెట్టొద్దంటారని దేశభక్తులంతా మనమీద విరుచుకు పడతారు కాబట్టి పోనిద్దాం. వీళ్లకూ పాత గాంధేయులకూ రెండు మూడు తేడాలున్నాయి. రూపం మేరకు తీసుకుంటే వీళ్లు ఖద్దరు మనుషులు కారు. ఇంగ్లీష్ చదువులు చాలా చదివి ఎవరికీ అర్థం కాకుండ రాయగల సామర్థ్యం గలవాళ్లు. విదేశాలలో ఘరానా చదువులు/ఉద్యోగాలు నెరపి తరచు విలాయతీ పోయి వస్తూంటారు. వస్తువులోని తేడా చెప్పాలంటే వీళ్లు ఒక రకంగా పాత తరంకంటే కరడు గట్టిన గాంధేయులు. పాత తరానికి గాంధిజం, మార్క్సిజం అనేది లిబరలిజం మొదలయిన రాజకీయ దృక్పథాలకు ఒకానొక ప్రత్యామ్నాయం మాత్రమే. ఈ కొత్తతరం వారికి అది ఏకైక అఖండమయిన 'భారతీయ' దృక్పథం. అది ఆధ్యాత్మికం, సాత్వికం, మానవీయం, వగైరా వగైరా.

అప్రాచ్యదృక్పథాల (మార్క్సిజం యుక్తంగా) కోణం నుండి చూస్తే అది అర్థమే కాదు. అట్లా చూడటమే అపచారం. ఎందుకంటే పాశ్చాత్య ప్రాచ్య దృక్పథాల పునాదే వేరు. ఒకటి భౌతికమయితే రెండవది ఆధ్యాత్మికం,ఒకటి పాదార్థికమయితే రెండవది పారమార్థికం. ఈ విధంగా గాంధిజం ఆధునిక దృక్పథాల విమర్శకు అతీతంగా నిలబెట్టబడుతోంది. త్వరలో అది అపౌరుషేయంగా ప్రకటింపబడినా ఆశ్చర్యం లేదు.

తాత్విక స్థాయిలో మాత్రమే కాదు. జాతీయోద్యమంలో కాంగ్రెస్ పాత్ర గూడ రోజురోజుకూ మరింత వీరోచితంగా చిత్రీకరించ బడుతోంది. చరిత్ర పునరావలోకనంలో కాంగ్రెస్ నాయకుల గతకాలపు పరాక్రమం దినదినప్రవర్థమానమవుతోంది. ఆమధ్య అరుణ్‌శౌరి కమ్యూనిస్టుల 'విద్రోహాన్ని' దూషిస్తూ ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో రాసిన వ్యాసంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో కాంగ్రెస్ నాయకులు చేతులు కాళ్లూ విరగ్గొట్టుకొని తలలు పగలగొట్టుకొని దేశమాత కోసం రక్తతర్పణం పెట్టిన వైనాన్ని కొనియాడటం చదివితే చరిత్ర తెలిసిన వాళ్లెవరయినా నోరు నొక్కుకోక తప్పదు.

అందుకనే ఇవ్వాళ జాతీయోద్యమంలో కాంగ్రెస్ స్థానాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది. ఈ అవసరం ఇన్నేళ్లయినా సమగ్రంగా తీరక పోవడం విచారకరం. 1952 తరువాత కమ్యూనిస్టు పార్టీ తన వ్యూహాన్ని మార్చుకోవడంతో బాటు అన్నిరకాల మర్యాదస్తుల లక్షణాలనూ ఒంట బట్టించుకుంది. గాంధీనీ కాంగ్రెస్‌నూ 'బాధ్యతారహితంగా' తిట్టడం మానేసింది. కాంగ్రెస్ అగ్రగామి జాతీయశక్తి అయింది. గాంధీ సామాజికంగా తిరోగామి దృక్పథం గలవాడయినప్పటికీ ప్రజలనాడి ఎరిగి జాతీయోద్యమం నడిపిన మహాత్ముడయ్యాడు. బిపిన్ చంద్ర వంటి మేధావులకయితే, కాంగ్రెస్ నాయకులదే సరయిన చైతన్యం, తక్కినదంతా తప్పుడు చైతన్యం.

అయితే మార్క్సిస్టు పరిశీలకులలో విమర్శనాత్మకంగా కాంగ్రెస్‌ను అంచనా వేసినవారు లేకపోలేదు. అందులో నంబూద్రిపాద్ నుండి సుమిత్ సర్కార్ వరకు చాలా మందే వున్నారు. జాతీయోద్యమంలో గాంధీ అవలంబించిన వ్యూహాన్ని అర్థం చేసుకోవడానికి వీళ్లొక సిద్ధాంత చట్రాన్ని ప్రతిపాదించారు. బ్రిటిష్ వాళ్లనుండి

రాయితీలు కోరినప్పుడల్లా ఒక ఒత్తిడిగా గాంధీ ప్రజా ఉద్యమాలను వాడుకున్నాడు. అయితే ఆ ఉద్యమం వర్గపోరాట రూపం తీసుకోకుండ చూడడం కోసం మౌలిక మయిన డిమాండ్లు పెట్టకుండ, ఉప్పుతయారుచేయడం, సారా దుకాణాలు పికెటింగ్ చేయడం, సత్యాగ్రహం మొదలయిన కార్యక్రమాలు తీసుకునేవాడు. అప్పటికే ఉద్యమం చేయిదాటిపోయేటట్టు కనిపిస్తే, అటు బ్రిటిష్ ప్రభుత్వం ఇటు కాంగ్రెస్ పార్టీ ఇద్దరూ రాజీకి రావడం, గాంధీ ఉద్యమాన్ని విరమించడం, జరిగేది.

ఈ సిద్ధాంత చట్రం కాంగ్రెస్ యొక్క జాతీయోద్యమ వ్యూహాన్నీ, తద్వారా సూచన ప్రాయంగా కాంగ్రెస్ వర్గ స్వభావాన్ని వివరించడానికి బాగా పనికి వస్తుంది. అయితే కాంగ్రెస్ పార్టీ యొక్క సామాజిక స్వభావాన్ని సమగ్రంగా తెలుసుకోవ డానికి ఇది చాలదు. ఈ చరిత్రను ప్రజలజ్ఞాపకాల ఆధారంగా పునర్నిర్మించే ప్రయ త్నం బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి కొంత ఇప్పుడిప్పుడే జరుగు తోంది. దీనికి Subaltern History అని, Hitsory from below అని కొత్త కొత్త పేర్లు పెట్టి గందరగోళం చేస్తున్నారు గాని ఈ పండిత వ్యామోహాన్ని క్షమిస్తే వాళ్ళ పరిశోధన ఉపయోగకరమయినదే. మన దగ్గర మాత్రం అటువంటి ప్రయత్నం ఇంకా మొదలు కానేలేదు. కాని జాతీయోద్యమ కాలానికి సంబంధించిన నవలలోను, కథలలోను ఇతర రచనలలోను ఆ చరిత్ర శకలాలు దొరుకుతాయి. వుప్పల లక్ష్మణరావుగారి 'అతడు-ఆమె'లో ఈ శకలాలను అన్వేషించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

* * *

శాంతంకూ శాస్త్రికీ పెళ్ళి ఎప్పుడయింది? లక్ష్మణరావుగారు ఎక్కడా చెప్పలేదు గాని, నవలలో జాతీయోద్యమం ప్రస్తావనను బట్టి ముందుకూ వెనక్కీ లెక్కలు కడితే 1926 అనుకుంటాను.

అప్పటికి గాంధీగారి మొదటి సత్యాగ్రహ ఉద్యమం అయిపోయింది. చౌరీ చౌరాకు భయపడి ఆయనగారు దాన్ని విరమించేసారు. ఖిలాఫత్ వచ్చింది, పోయింది. హిందూ ముస్లిం భాయిభాయి పోయి మత విద్వేషాలు రెచ్చగొట్టడం మళ్లీ మొదల యింది. సంసారాలు వదిలి ఉద్యమంలోనికి దూకిన వాళ్ళందరినీ గాంధీ రాట్నం తిప్పమని, హరిజన సేవ చేయమని, మత సామరస్యం బోధించమని తిరిగి పంపాడు.

కొందరు ఖద్దరుధారులయ్యారు, కొందరు మొదటి రుచితోనే కాంగ్రెస్ సత్తా తెలుసు కొని అన్యమార్గాల అన్వేషణలో పడ్డారు. కాంగ్రెస్ వారి జాతీయోద్యమం స్తబ్ధంగా వున్న కాలం యిది. మళ్ళీ సైమన్ కమీషన్ వచ్చి అందులో తమకు ప్రాతినిధ్యం ఇవ్వలేదని అలిగేదాకా అందులో మళ్ళీ కదలిక రాదు.

'అతడు-ఆమె' లో గూడ రాజకీయాల ప్రస్తావన మొదటి 100 పేజీలలో లేదు. బారిస్టర్ భర్త, లెక్చరర్ భార్య, రెండుచేతుల సంపాదన రెండుచేతుల ఖర్చు, కొత్త దాంపత్యం కొత్త జీవితం, వ్యాపార పకాల్తీకి వకాలత్, వ్యాపారానికి సహజ మయిన ఆటుపోట్లు, పెద్ద యిల్లా పెద్ద కారూ అమ్మి చిన్న ఇంట్లో అద్దెకు దిగడం, అత్తగారి కినుక పుణ్యాన కొద్దికాలం ఎడబాటు, మళ్ళీ లక్ష్మీదేవి కొందరు కోర్టు పక్షులయిన జమీందార్ల రూపంలో కటాక్షించి తిరిగి పెద్దయిల్లూ నౌకర్లూ తదితర భోగాలభాగ్యం — లక్ష్మణరావుగారి శిల్పం కోసం, ఉత్తరాంధ్ర నుడికారంలో చేయి తిరిగిన భాషకోసం కాకపోతే ఈ కథ చదవడం దండుగే.

ఉన్నట్టుండి పెళ్ళయిన నాలుగేళ్ళకి, ఉప్పు సత్యాగ్రహం రోజులలో, శాంతమ్మకు రాజకీయం అంటుకుంది. దాంపత్య జీవితపు కొత్తదనం చెరిగిపోయి భర్త నుండి మానసికంగా దూరం కావడంవల్ల తనకు రాజకీయాలపైన ఆసక్తి పెరుగుతోందని శాంతమ్మ తన సహజమైన భావవాద ధోరణిలో అనుకుంటుంది. ఆసక్తి పెరగడానికి ఒక రాజకీయమే లేకుంటే ఆ వైవాహిక వైమనస్యం ఎటుపోయి ఉండేదో.

నిజానికి ఈ మార్పు చాలా ఆసక్తికరమయినది. మనం బాల్యం గడిచి పెరిగే క్రమంలో సామాజిక నైతిక విలువలనూ ప్రమాణాలనూ అంతర్గతం చేసుకుంటాం. ఆ ప్రమాణాలకు సంబంధించిన స్పృహను అంతరాత్మ అంటాం. శాస్త్రికి ఈ అంత రాత్మలేదు. అది మినహా అతను మంచివాడే. బుద్ధి పూర్వకంగా ఒకరికి హానిచేయడు. తన స్వార్థాన్ని గురించి ఆలోచించే వ్యవధి లేకపోతే మంచిగూడ చేస్తాడు. (సము ద్రంలో కొట్టుకుపోతున్న కుర్రవాడి ప్రాణాన్ని తాను సముద్రంలోకి దూకికాపాడుతాడు) అయితే అతనికి నైతిక స్పృహలేదు. శాస్త్రిలోలేని ఈ అంతరాత్మ శాంతమ్మ. ఆమె ఒక వ్యక్తికాదు. ఆమె మధ్య తరగతియొక్క ఆత్మాధర్మం (ego-ideal అని అడ్లర్ అంటాడు). తెలివి, నీతి, ఓర్పు, దయ, క్షమ, జాలి, వివేచన, ఇవన్నీ ఆమెలో వున్నాయి. ఇవన్నీకాక అన్నింటినీ మించిన మధ్యతరగతి సద్గుణం ఆమెలో వుంది—

ఈ గుణాలు లేనివాళ్ళను చూసి కోపం చేసుకోకుండ అసహ్యించుకోకుండ ముచ్చటగా గర్వపడుతుంది, గొప్పవాళ్ళకు సహజమయిన వాత్సల్యాన్ని ప్రదర్శిస్తుంది. శాస్త్రిలో వున్న స్వార్థానికీ, లేని ఈ అంతఃకరణకూ మధ్య ఘర్షణ రావడం చాలా సహజం. అది నిర్దిష్ట రాజకీయ పరిస్థితులలో నిర్దిష్ట రాజకీయ రూపం తీసుకోవడం గూడ అంతే సహజం. అంతకు ముందే ఇంట్లో పనివాళ్ళ విషయంలో శాంతమ్మ 'సత్యకాలపు' మనిషిలాగ ప్రవర్తించడం చూసి శాస్త్రి ఆమెను మందలించడం, 'వాళ్ళుకూడా మనుషులే కదా' అని వాదిస్తూగూడ అతని లౌక్యానికి దారివిడిచి శాంతం ఏక సమయంలో తన మంచి తనానికీ అతని గడుసుదనానికీ గర్వించడం, జరుగుతుంది.

ఇంతలో ఆమెకు రాజకీయంఅంటుకుంది. అప్పటికే పదేళ్ళ ముందు జవహర్ లాల్‌నెహ్రూ అవధ్ ప్రాంతపు గ్రామాలు తిరిగి భారతదేశాన్ని 'డిస్కవర్' చేసిన వైనం స్వతంత్ర భారతంలో స్కూలుకు వెళ్ళిన ప్రతీ కుర్రవాడికీ తెలుసు. ఎందుకంటే పుట్టిపెరిగిన దేశాన్ని ఇంత లేటు వయసులో డిస్కవర్ చేసినందుకు సిగ్గు సహితం చెందకుండ ఆయన దాన్ని తన రచనలలో గర్వంగా ప్రకటించుకున్నాడు. శాంతం గూడ భర్తతో పుదుచ్చేరి పిక్నిక్‌వెళ్ళి అక్కడ ఒక బట్టల మిల్లులో కార్మికుల దుస్థితినిచూసి భారతదేశాన్ని డిస్కవర్ చేసింది. అప్పటినుండి శాంతంకు, శాస్త్రి మాటలలో 'సోషలిస్టు గాలి చల్లింది.' మానసికంగా ఆమెకు సోషలిస్టుగాలి తగిలిందిగాని ఆచరణలో ఆమె గాంధీని దాటిపోలేదు. తన ఖరీదయిన బట్టలు తగలబెట్టి ఖద్దరు ధరించడం మొదలు పెడుతుంది. దీనివల్ల ప్రయోజనం ఎంతవుందో ఆమెకు మొదటి నుండీఅనుమానమే. 'ఖద్దరు వాడకం బాగానేవుంది. చాలామంది కడుతున్నారు....ఆరు నెలలయి నియమంగా రాట్నం వడుకుతున్నాను. కాని స్వరాజ్యం సూచనలు కనిపించడంలేదు. ఉప్పు వండినంత మాత్రాన బ్రిటిష్‌వాడు భయపడి వెళ్ళిపోతాడా అని ప్రపంచంలో అందరూ నవ్వుకుంటున్నారు' అని తన డైరీలో రాసుకుంటుంది. గమనించవలసిన విషయం ఏమిటంటే ఈ సరికి శాస్త్రి ఘరానా బారిస్టరు. అతని క్లయింట్లు జమిందార్లు. నడిపే వ్యాజ్యాలు రైతులకు వ్యతిరేకంగా. ఆదాయం వేలల్లో, అచిరకాలంలో లక్షల్లో. చూపులు అడ్వకేట్ జనరల్ గిరీమీద, కొంచెం ఆశపెరిగిన పూట వైస్‌రాయి కౌన్సిల్‌మీద.

అప్పటి నుండి ఇక శాంతం క్రమంగా కాంగ్రెస్‌లోకి, శాస్త్రి ఆమె వెనుక

ఒక్కడుగు వెనక్కి- రెండడుగులు ముందుకూ వేస్తూ వెనక చూపులు చూస్తూ ముందుకు ప్రయాణం. శాస్త్రికి బ్రిటిష్‌వాళ్ళు దేశంలో ఉండాలనిగాని పోవాలనిగాని ఏమీలేదు. అతను దేశాభిమానహీనుడు కాడు, ఆదర్శాలకు అతీతుడు మాత్రమే. బ్రిటిష్ వాళ్ళు ఉంటే తాను అడ్వకేడ్ జనరల్ కావాలి, పోతే కాంగ్రెస్‌వారి స్వరాజ్యంలో సుప్రీం కోర్టు జడ్జి కావాలి. రెంటికీ చెడకుండ సాముచేయడం ఎలాగన్నదే అతని బాధ. రోడ్లో కాంగ్రెస్ కుర్రవాళ్ళు చందా అడిగితే తాను ఇవ్వడు, శాంతం అనాలోచితంగా 25 రూపాయిలిచ్చి రసీదు పుచ్చుకుంటే ఆమె పేరునుబట్టి తన భార్య అని గుర్తు పడతారేమోనని భయపడతాడు, కాని రసీదు మాత్రం జాగ్రత్త చేయమంటాడు— స్వరాజ్యం వస్తేగిస్తే సర్టిఫికేట్ కావాలి గదా.

ఈభార్యాభర్తలిద్దరూ కాంగ్రెస్‌పార్టీ సామాజిక స్వభావానికి రెండు పార్శ్వాలు. కార్మికులు, కూలీలు, సామాన్య రైతులు, తమ సంఘాల ద్వారానూ ఏ సంఘాలూ లేకుండానూ పోరాటంచేసి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. వేతనాలకోసం పోరాటాలు చేసారు, శిస్తు భారానికీ భూస్వామ్యానికీ వ్యతిరేకంగా పోరాటాలు చేసారు. కాంగ్రెస్ సత్యాగ్రహాలలో గూడ ఒకరిద్దరు భాగం పంచుకున్నారు. కాని వాళ్ళెన్నడూ ఒక వర్గంగా 'కాంగ్రెస్ మనుషులు' కాదు. కాంగ్రెస్ మనుషులు రెండు జాతులవాళ్ల. ఒకటి, రోజురోజుకూ విస్తరిస్తున్న బూర్జువా-భూస్వామ్య వర్గం. రెండు మధ్య తరగతి. ధనికవర్గం కాంగ్రెస్‌ను నడిపింది. కాంగ్రెస్‌ను పోషించింది. కాంగ్రెస్ నాయకత్వాన్ని తానే నిర్వహించి కొంత, తన గుప్పిట్లో పెట్టుకొని కొంత తన అవసరాలకు అనుకూలంగా ఆ పార్టీని మలిచింది. మధ్య తరగతి కాంగ్రెస్‌కు వేలాది సత్యాగ్రహులను, స్థానిక నేతలను. లాఠీదెబ్బలు తినే వాలంటీర్లను ఇవ్వడమేకాక, తన నైతిక ప్రమాణాలను కాంగ్రెస్‌కు అరువిచ్చింది. రుగ్వేదంలోని పురుసూక్తాన్ని అనుకరించాలంటే కాంగ్రెస్ అనే బ్రహ్మకు ధనికుడు వెన్నుముక, గుండె, మెదడు అయితే పెటీ బూర్జువావర్గం కాళ్ళు, పాదాలు, అంతరాత్మ.

అట్లాగంటే ధనికవర్గం మొత్తంగా కాంగ్రెస్‌ను సమర్థించిందని కాదు. బ్రిటిష్ వాళ్ళనుండి అధికారాన్ని తమకు బదలాయించుకొని తామే రాజ్యం చేయడంవల్ల లాభం వుందని వాళ్ళందరూ గుర్తించినా, అది అయ్యేపని అన్న నమ్మకంవున్న బిర్లాల వంటి వాళ్ళే కాంగ్రెస్‌ను పూర్తిగా సమర్థించారు. అది అయ్యేదోకాదో, పరాయి పాలన అయితే మాత్రం వ్యాపారానికి చేదా అనుకున్న వాళ్ళు దూరంగా వున్నారు, మరొక

కోణం నుండి చూస్తే, ఈ ఉద్యమాలు మొదలుపెడితే అది బోల్షెవిజానికి (ఆ రోజులలో కమ్యూనిజాన్ని ఇంకా బోల్షెవిజం అనేవారు) దారి తీస్తుందని భయపడి కొందరు దూరంవుంటే, బోల్షెవిజం నుండి దేశాన్ని కాంగ్రెసే రక్షించగలదని ఇతరులు దగ్గరయ్యారు. వాస్తవానికి ఈ రెండు వైఖరుల మధ్య స్పష్టమయిన విభజనరేఖలేదు. ధనికవర్గంలో అందరిలోనూ ఈ రెండు వత్తిడులు వున్నాయి. అందుకే వాళ్ళకు కాంగ్రెస్ అంటే ఏక సమయంలో భయం, కోపం, ఆప్యాయత, ఆదరణ. క్రమంగా స్వరాజ్యం సంభవం అనిపించిన తరువాతే వాళ్ళు పూర్తిగా కాంగ్రెస్ మనుషులయ్యారు,

ఆర్థికంగా మాత్రమేగాక వ్యక్తిత్వరీత్యాగూడ శాస్త్రి ఈ కోవకు చెందినవాడే. ఉప్పు సత్యాగ్రహం రోజులలో శాంతంలో కొత్తగా చిగురిస్తున్న భావాలను వేళాకోళం చేసి, ఆమె ఖద్దరు ధరిస్తే 'ఇప్పుడే తొందరే మొచ్చింది. నేను రెండు మూడేళ్ళు అడ్వకేట్ జనరల్ గిరీచేసి పాపాయికి మంచి సంబంధం చూసి . . . రెండు లకారాలు సంపాదించిన పిదప - నేను గూడ జాతీయవాదినే కదా - ఇద్దరం ఒకేసారి దిగుదాం' అని కోర్టువారిని వాయిదా అడిగినట్టు అడిగి, రెండేళ్ళ తరువాత రౌండ్ టేబిల్ సమావేశం విఫలమయి విరమించుకున్నప్పుడు 'అసలు మొదలు పెట్టడమే తెలివి తక్కువ' అనుకున్ననాటినుండి, మరొక మూడేళ్ళు గడిచి 1936 ప్రొవిన్షియల్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి ప్లేటు పూర్తిగా ఫిరాయించి తనకు కాంగ్రెస్ టిక్కెట్ సంపాదించి పెట్టమని శాంతంను అడిగినదాకా, శాస్త్రి విశ్వాసాలలో ఎటువంటి మార్పులేదు. పరిస్థితులలోనూ అవకాశాలలోనూ మాత్రమే మార్పు వుంది. ఇదే శాంతంకు కోపం తెప్పిస్తుంది. నీతిని ఆచరించకపోతే మధ్యతరగతి మనస్తత్వం సులువుగా క్షమించేస్తుంది, కాని నీతిని ప్రదర్శించకపోతే క్షమించదు. శాస్త్రి ఆదర్శాలను ఆచరించడు, ప్రదర్శించడు.

దీనితోబాటు శాంతంలో ప్రజాస్వామిక భావాలు ప్రబలేకొద్దీ ఆమెకూ శాస్త్రికీ అభిప్రాయ భేదాలు పెరుగుతాయి. ఈ ప్రజాస్వామిక భావాలు గాంధిజంనుండి పుట్టినవి కావు.

చుట్టూవున్న రైతాంగ పోరాటాలు, కార్మికపోరాటాలనుండి, సోషలిస్టు కమ్యూనిస్టు భావాలనుండి పుట్టినవి. ఉదాహరణకు రైతులను బేదఖల్ చేసి హత్యలు

చేయించిన జమీందార్ల వ్యాజ్యం శాస్త్రి చేపట్టినప్పుడు కాంతంకు కోపం వస్తుంది. గాంధీకి కోపం వచ్చి ఉండేదా? సత్యాగ్రహ ఉద్యమంలో రైతులు జమీందార్లకు ఎటువంటి ఇబ్బందీ కలిగించకూడదని ఆదేశించినవాడు కాడూ? పైగా గాంధీ నమ్మిన వర్ణాశ్రమ ధర్మం నిర్దేశించే నీతిలో ఒక వకీలు జమీందార్ల వ్యాజ్యం చేసినా రైతుల వ్యాజ్యం చేసినా అది అతని ధర్మనిర్వహణే. అందులో న్యాయాన్యాయాల ప్రసక్తి పాశ్చాత్య సోషలిస్టు గాలి తగిలిన కాంతం లాంటి వాళ్ళు తెస్తున్నారుగాని ఆ మీమాంస 'భారతీయం' కాదు. దక్షిణ ఆఫ్రికా కాలంనుండి గూడ ప్రజా ఉద్యమాలు అహింసాత్మకంగా నడవాలని పట్టుబట్టిన గాంధీ మొదటి ప్రపంచ యుద్ధంలో బేషరతుగాను, రెండవ ప్రపంచ యుద్ధంలో 'స్వరాజ్యం' అనే షరతుతోనూ బ్రిటిష్ యుద్ధ ప్రయత్నాలకు తన మద్దతు ఇవ్వడానికి సిద్ధపడడం చాలామంది పరిశీలకులకు ఆశ్చర్యం కలిగించింది. ఇందులో ద్వంద్వ ప్రమాణాలు సహితం కనబడ్డాయి. కాని అటువంటిదేం లేదు. ఇవన్నీ గాంధీని పాశ్చాత్య దృక్పథంతో చూడడం వల్ల వచ్చిన కళంకలు. అనాదిగా భారత సాంప్రదాయంలో రాజులు యుద్ధం చేయడం హింస అనిపించుకోలేదు, అది రాజుల ధర్మం. అహింస ప్రజల ధర్మం మాత్రమే.

ఎలాగయితేనేం, అది గాంధిజంగాని, సోషలిజంగాని, శాస్త్రి గాభరా గాభరా మాటల్లో బోల్షెవిజంగాని, కాంతం మానసికంగా శాస్త్రికి దూరం అయింది. చివరికి ఒకనాటికి సహించలేక 'కొన్నాళ్ళపాటు - కొంత దూరంపాటు' చీలిపోయి ఎవరిదారిన వారు పోవాలని నిర్ణయించుకుంటుంది. నిర్ణయించుకొని తన కుమార్తె లక్ష్మిని, పెంపుడు కుమార్తె సుభనూ తీసుకొని దేశం చూడడానికి బయలుదేరుతుంది. అయితే ఆమె దేశం చూడడం గూడ వట్టి దేశాటనం కాదు. సినీమా బాక్సాఫీస్ ఫార్ములా పూర్తి కావాలంటే కాశ్మీర్ లోయలో, సరస్సులో చూపించక తప్పనట్టు జాతీయోద్యమ నవల లాక్షణికంగా పరిపూర్ణం కావాలంటే నాయకుడుగాని నాయికగాని గతకాలపు ఘనతను తలపింపజేస్తూ చరిత్రాత్మకమయిన స్థలాలను దర్శించి 'ఏవి తల్లీ....' అని కవిత్వం వల్లించక తప్పదు. మన జాతీయోద్యమానికీ జ్యాగ్రఫీకీ విచిత్రమైన సంబంధం వుంది. అన్ని దేశాలలోనూ పాడుబడ్డ కోటలూ, పాతకాలపు గుళ్ళూ వుంటాయిగాని అవి అన్ని దేశాలలోనూ జాతీయ చైతన్యానికి ఆలయాలు కావు. మన దేశంలో మాత్రం జాతీయవాది అయినవాడు కాశీనుండి హస్తినాపురం దాకా ('సెక్యులర్' అయితే ఆగ్రానుండి అహమ్మద్ నగర్ దాకా గూడ) తీర్థయాత్ర

జరిపి ప్రతిచోటా యథోచితంగా పరవశించిపోకపోతే వాడు జాతీయవాదే కాదు. ఈ విషయంలో లక్ష్మణరావుగారు ఫార్ములా తప్పలేదు. శాంతం తిన్నగా కలకత్తా వెళ్ళి అక్కడినుండి, ప్రాచీనకాలంలో మగధనుండి తక్షశిలకు వణిక్‌శ్రేణుల బండ్ల బాటగా మొదలయి, సుల్తాన్ల కాలంలో పకడ్బందీగా సరాయీలూ సత్రాలతో సహా పునర్నిర్మించబడి, బ్రిటిష్ కాలంలో కలకత్తానుండి లాహోర్‌దాకా గ్రాండ్‌ట్రంక్‌రోడ్‌గా (కిప్లింగ్ రవి అస్తమించని సామ్రాజ్యపు వైవిధ్యానికీ విస్తీర్ణానికీ ప్రతీకగా) అవతరించి, 1947 తరువాత మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్న భ్రమకు రుజువుగా నేషనల్ హైవే నెంబర్ వన్‌గా పునర్నామకరణం చెందిన మార్గం గుండా (రోడ్డు మీద కాదు, రైలులో) ప్రయాణిస్తుంది. చేతిలో పుష్కలంగా డబ్బులున్నాయి కాబట్టి రైలులో రెండవ తరగతిలో (ఇవాల్టి రెండవతరగతి కాదు, మన దేశానికి సోషలిజం రాకముందు, అంటే మూడవ తరగతి పెట్టెలు రద్దు చేయబడక ముందు సంగతి ఇది) ప్రయాణించి ఒక్కొక్క ఊరూ చూస్తుంది. కాశీ, జావున్‌పూర్, ఢిల్లీ, శ్రీనగరం, అమృత్‌సర్ — అన్నిచోట్లా చరిత్రను ఆవాహనం చేసుకొని పులకించి పోతుంది. మనల్ని గూడ అదే అనుభూతి పొందమంటుంది. ఇలా ఇంకా ఎంతకాలం పురావస్తు పర్యటనం చేసేదో కాని శాస్త్రి ఆమెను తిరిగి రప్పించుకోవడానికి వ్యూహం పన్నుతాడు. బిర్లా కుటుంబానికి తొలినాడే కలిగిన నమ్మకం శాస్త్రికి ఇంతకాలానికి కలుగుతుంది. కాంగ్రెస్ వాళ్ళ స్వరాజ్యం తప్పక వస్తుందనీ బ్రిటిష్‌వాడు అడ్వకేట్ జనరల్ గిరీ ఇవ్వకపోతే స్వరాజ్యం వచ్చిన తరువాత సుప్రీంకోర్టు జడ్జి కావచ్చుననీ ధైర్యం వస్తుంది. ఇక అందుకు సన్నాహాలు మొదలుపెడతాడు. అంతకాలం రైతులకు వ్యతిరేకంగా జమీందార్ల కేసులు చేసినవాడు ఇప్పుడు దిక్కులేని రైతుల తరపున ఫీజులేని వకాల్తీ పుచ్చుకొని ప్రీవీ కౌన్సిల్‌లో వాదించడానికి సొంత ఖర్చు మీద ఇంగ్లండ్ వెళ్తాడు. శాంతం సంతోషించి అతనితో కలిసి వెళ్తుంది. మధ్య తరగతి అంతరాత్మను సంతోషపెట్టడానికి నటనకంటె ఎక్కువ అక్కరలేదు.

ఇక్కడితో మొదటి అంకం పరిసమాప్తి. రెండవఅంకం రెండవతరానికి చెందినది. శాస్త్రి శాంతంల ఎంత ఆసక్తికరమయిన పాత్రలో సుభద్ర అంత పూర్తిగా కృత్రిమమయిన పాత్ర. నాందేడ్‌కు పన్నెండు మైళ్ళ దూరంలో పల్లెటూరిలో ఒక కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయి రెండేళ్ళు శాస్త్రీ శాంతలతో ఉండగానే తన భాషనూ భావాలనూ అంత పూర్తిగా మార్చేసుకోవడం అసాధ్య

మయిన విషయం. ఎలాగయితేనేం, వాళ్ళతోబాటు ఇంగ్లండు వెళ్ళివచ్చి పూర్తిగా ఆస్తిపాస్తులు గల కోస్తా ఆంధ్ర కాంగ్రెస్ దంపతుల కుమార్తెగా మారిపోతుంది. వీళ్ళు ఇంగ్లండ్‌నుండి తిరిగి వచ్చేసరికి రెండవ ప్రపంచయుద్ధం వాతావరణం. శాస్త్రి తన పాపాలను ప్రీవీ కౌన్సిల్‌లో కడిగేసుకొని ఖద్దరు మనిషి అయిపోయాడు. శాంతం తన వ్యక్తిత్వాన్ని వదులుకోకుండ తొలినాటి అనుమానాలు మాత్రం వదులు కొని కాంగ్రెస్‌లో ముఖ్యవ్యక్తి అయింది.

భారతదేశపు పెట్టుబడిదారీ వర్గం రెండు ప్రపంచ యుద్ధాలలోనూ కొత్త రక్తాన్ని ఎక్కించుకుంది. యుద్ధంవల్ల ప్రజలకు నష్టంగాని, వ్యాపారానికి చాలా లాభం. కాంట్రాక్టులు, నల్ల బజారు తదితర వ్యవహారాలలో కోట్లు సంపాదించు కున్నారు. రెండవ ప్రపంచయుద్ధం మన సరిహద్దులదాకా వచ్చింది కాబట్టి ఈ లాభాలు మరింత వచ్చాయి. ఇట్లా లాభాలు సంపాదించిన వాళ్ళు చాలామంది ఖద్దరు మనుషులే. మొదట్లో కానివాళ్లు గూడ లాభాలు సంపాదించిన తరువాత ఖద్దరు మనుషులయ్యారు.

నవల రెండు మూడు భాగాలలో ఈ కొత్త బూర్జువా వర్గం తరచుకనబడు తుంది. బర్మానుండి అస్సాంకు పారిపోయివచ్చిన కాందిశీకులకు అత్యధికలాభాలకు తిండిగింజలు అమ్మి వాళ్లస్త్రీలచేత వ్యభిచార వ్యాపారం నడిపించి కోట్లు సంపాదించిన ఆసామి కొడుకు సీతారాం. ఆర్మీకాంట్రాక్టులు చేసి ఇనపరాడ్లనుండి సిమెంటు కంకర దాకా అన్నీస్వాహాచేసే కంపెనీలో ఇంజనీరు. ఇతనికి పూర్తిగా విరుద్ధంగా, ఆర్మీ ఇంజనీరుగా వుంటూ ఈ గందరగోళ పరిస్థితిలో కాంట్రాక్టర్లతో ఏమాత్రం లాలూచీ పడినా లక్షలు సంపాదించే అవకాశం ఉండిగూడ, చిన్ననాడు నీళ్ల బిందెలు మోసి తనను పెంచిన తల్లినేర్పిన నీతి వాక్యాలను తిరస్కరించలేని అర్భకుడు జనార్ధనం. అయితే అర్భకుడి నైతిక వర్తనం తన డైరీని దాటిపోదు. కాంట్రాక్టరు పై ఆఫీస ర్లతో లాలూచీ పడి రైల్వేబ్రిడ్జికి బిల్లు 12 లక్షలు ఎక్కువ వేస్తే దాన్ని ఒక్కొక్క పైసా లెక్కగట్టి బిల్లు తగ్గించినందుకు పై ఆఫీసర్లు జనార్ధనానికి ప్రమోషన్ ఇచ్చి కాంట్రాక్టరుకు మాత్రం 10 లక్షలు పారితోషికం ఉచితంగా ఇచ్చిననాడు, 'దొంగలు దొంగలూ దోచుకొనివాళ్లు పంచుకున్నారట' అనుకోవడం ప్రమోషన్‌ను ఆమోదించి లెఫ్టినెంట్ కల్నల్ కావడం తప్ప జనార్ధనం చేయగలిగింది లేదు.

రాజకీయంగా గూడ ఈకాలం చాలా గందరగోళమైనది. ఆ చరిత్ర గతించి పోయిన తరువాత మనం ఇవ్వాళ రెండవ ప్రపంచ యుద్ధాన్ని గురించి సులువుగా ఒక వైఖరి అవలంబించ గలుగుతున్నాము గాని, ఈనాడు పరిస్థితి అంతస్పష్టంగా లేదు. హిట్లర్ యూదులనూ సోషలిస్టులనూ కమ్యూనిస్టులనూ కాథొలిక్కులనూ ఊచకోత కోసిన మాట వాస్తవమే. అయినా హిట్లర్‌ను ఇవ్వాళ మనం ద్వేషిస్తున్నట్లు ఆనాడు ఆసియా ఆఫ్రికా దేశాలలో అందరూ ద్వేషించలేదు. దీనికి ఒక కారణంవుంది. మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ ఫ్రాన్స్ తదితర దేశాలు కలిసి జర్మనీని ఓడించాయి. యుద్ధంలో గెలిచిన దేశాలు ఓడిపోయిన దేశాలను కొల్లగొట్టడం చరిత్రలో అనాదిగా వస్తున్నదేగాని, ఈ యుద్ధంలో ఓడిపోయిన జర్మనీ మీద 'నైతిక' భారాన్ని మోపి, గెలిచిన దేశాలకు జరిగిన నష్టానికి పరిహారం జర్మనీ చెల్లించాలని కొత్త సూత్రాన్ని ప్రవేశపెట్టారు. అసలే ఓడిపోయి చితికిపోయిన జర్మనీ ఈ నష్టపరిహారం చెల్లించలేక మరింత క్రుంగిపోయింది. అపూర్వమయిన ద్రవ్యోల్బణం జర్మనీ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. దీనిని ప్రపంచంలోని ప్రజాస్వామిక వాదులంతా నిరసించారు. పైగా జర్మనీని ఇట్లా అణగదొక్కుతున్న బ్రిటన్ ఫ్రాన్స్‌దేశాలు ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యాలు నెలకొల్పి ప్రపంచ ప్రజలను దోచుకుంటున్న దేశాలు కావడంవల్ల ఈ వ్యతిరేకతకు బలం వచ్చింది. ఈ పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొన్న వాడు హిట్లర్. అతను అధికారానికి వచ్చిన వెంటనే వర్సయిల్స్ సంధిని త్రోసిపుచ్చి, ఇక నష్టపరిహారం చెల్లించబోమని ప్రకటించాడు. ఆసియా ఆఫ్రికా దేశాలలో చాలా మంది ఈ సాహసాన్ని హర్షించారు. అందుకనే హిట్లర్ పక్షం వహిస్తే మనకు స్వరాజ్యం వస్తుందని చాలామంది నమ్మగలిగారు. మరొకవైపు, నాజీవాదం పుట్టుకకు బాధ్యత ఎవరిదయినప్పటికీ, అది ప్రపంచంలో ప్రజాస్వామ్యానికి పెద్దగొడ్డలి పెట్టని కొందరు గ్రహించారు. రెండవ ప్రపంచ యుద్ధం మొదలయిన తొలిసంవత్సరాలలో జర్మనీ సాధిస్తోన్న విజయాలను చూసి ఈ భయం ఇనుమడించింది. చివరికి హిట్లర్ తనకు ఎటువంటి అపకారం చేయని సోవియట్ రష్యామీద గూడ దాడి చేసినప్పుడు ఇంకా ఏవయినా అనుమానాలు మిగిలివుంటే అవి గూడ పటాపంచలయ్యాయి.

ఇటువంటి వాతావరణంలో భారత జాతీయ ఉద్యమం ఏ వైఖరి అవలంబించాలన్నది సులువయిన నిర్ణయం కాదు. కమ్యూనిస్టులనో, సుభాష్‌చంద్రబోసునో దూషించడానికి చరిత్రను వక్రీకరిస్తే అది వేరే సంగతి. కాంగ్రెస్‌లోగూడ దీని

గురించి ఏకాభిప్రాయం లేదు. గాంధీ, పటేల్, నెహ్రూ, రాజాజీ, అజాద్-ఒక్కొక్కరికీ ఒక్కొక్క వైఖరి. బ్రిటిష్ యుద్ధ ప్రయత్నాలకు సహకరించాలని కొందరు భావిస్తే, జపాన్‌తో చేతులు కలపాలని కొందరు, తటస్థంగా వుండాలని కొందరు, బ్రిటిష్‌వాళ్ళను బెదిరించి రాయితీలు తీసుకోవాలని కొందరు అభిప్రాయపడ్డారు. గాంధీ ఎప్పటిలాగే బ్రిటిష వాళ్ళతో మంతనాలకు దిగి వీలయినంతలాభం సంపాదించాలని ప్రయత్నించాడు. మూడునాలుగేళ్ళపాటు మంతనాలు ఎడతెరిపిలేకుండసాగాయి. అయితే ఈసారి బ్రిటిష్‌వాళ్ళు లొంగిరాలేదు. దానికి కారణం ఎంతవరకు పరిస్థితుల తీవ్రత, ఎంతవరకు చర్చిల్ మూర్ఖత్వం అనేది చరిత్రకారుల చర్చ. ఇక అప్పుడు (1942 ఆగస్టులో) 'క్విట్ ఇండియా' తీర్మానంచేయక కాంగ్రెస్‌కు తప్పలేదు. ఈ తీర్మానాన్ని కాంగ్రెస్‌యొక్క దేశభక్తి పరాక్రమ శీలానికి నిదర్శనంగా కొనియాడడం ఇవ్వాళ అరుణ్‌శౌరికి చెల్లిందిగాని, నిజానికి ఆనాడు అది కాంగ్రెస్ గత్యంతరం లేక తీసుకున్న నిర్ణయం. అంతకు మూడేళ్ళముందు, యుద్ధం మొదలయిన అదను చూసుకొని సత్యాగ్రహం ప్రారంభిస్తే స్వరాజ్యం సాధించవచ్చునని కాంగ్రెస్‌లో ప్రతిపాదన వచ్చినపుడు గాంధీ 'ఇప్పుడు సత్యాగ్రహం ప్రారంభిస్తే అదుపులో ఉంటుందని నమ్మకంలేదు' అని తిరస్కరించాడు. అటువంటి వాడు మూడేళ్ళు గడిచేసరికి ప్రజలను అన్నిరంగాలలోనూ తిరగబడి బ్రిటిష్ వాళ్ళను తరిమేయమని పిలుపిచ్చాడంటే, అందులో పరాక్రమంకంటే రాజకీయమే ఎక్కువవుంది.

కాంగ్రెస్ నాయకులలో చాలామందికి ఈ నిర్ణయం నచ్చలేదు. రాజాజీ పార్టీ వదిలి వెళ్ళిపోయాడు. నెహ్రూ అయిష్టంగా వుండిపోయాడు. బోసు అంతకుముందే వెళ్ళిపోయాడు. ఒక్క కాంగ్రెస్‌లోని సోషలిస్టు బృందం మాత్రమే ఆ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా సమర్ధించింది. సామాన్యప్రజానీకంలోని సామ్రాజ్యవాద వ్యతిరేకతకు ఈ పిలుపు ఒకమార్గం చూపెట్టింది. కాబట్టి వాళ్ళుమాత్రం అపూర్వమయిన ఉత్సాహంతో స్పందించారు. నాయకులులేక నాయకత్వంలేక ఒక ఆరునెలలపాటు పెట్రోల్ మండినట్టు మండారు.

శాస్త్రికిగూడ గాంధీ వ్యవహారం నచ్చలేదు. శాస్త్రికే కాదు, కాంగ్రెస్‌లోని శాస్త్రివర్గానికి ఈ కొత్తపిలుపు ఎంతమాత్రం రుచించలేదు. 1942 ఆగస్టు నుండి శాస్త్రి ఒకకాలు రాజాజీ క్యాంపులో, ఒకకాలు గాంధీ కాంగ్రెస్‌లో పెట్టి నడుస్తున్నాడు. పోనీ కాంగ్రెస్‌లోని శాంతం వర్గానికయినా నచ్చిందా అంటే అదీ లేదు. అంతకాలం

అహింస ఒక్కటే నీతివంతమయిన మార్గమనీ హింస పాపమనీ కమ్యూనిస్టులనూ ఇతర మిలిటెంటు జాతీయవాదులనూ తూలనాడి ఇప్పుడు ఒక్కసారిగా తిరుగుబాటు చేయమంటే వాళ్ళకు తికమక అయింది. అందుకే తన కమ్యూనిస్టు చిన్న కూతురు లక్ష్మి పేచీకోళం చేస్తే చెప్పడానికి శాంతం దగ్గర సమాధానం లేదు.

కాంగ్రెస్ తీసుకున్న 'క్విట్ ఇండియా' నిర్ణయం కమ్యూనిస్టులకు గూడ ఇబ్బంది అయింది. నవలలో లక్ష్మి, అమృతరావు, అమృతవల్లి, చాలా గంభీరంగా కనబడతారుగాని అది చాలావరకు లక్ష్మణరావుగారు కృత్రిమంగా కల్పించిన గాంభీర్యమే. అంతవరకు మిలిటెంట్ జాతీయవాదులుగా కనబడ్డ కమ్యూనిస్టులను కాంగ్రెస్ వారు మొట్టమొదటిసారిగా 'దేశద్రోహులు' అని దూషించగలిగారు. తమ అంతర్జాతీయతను జాతీయతను సమన్వయ పరచలేక కమ్యూనిస్టులు సందిగ్ధంలో పడ్డారు. పాకిస్తాన్ విషయంలోనూ అంతే. కాంగ్రెస్ - ముస్లింలీగ్ పార్టీల రాజకీయాలు దేశ విభజనకు అనివార్యంగా దారితీస్తున్నవైనాన్ని వివరించకుండ, 'జాతిసమస్య' పేరిట జిన్నాను సమర్థించి మళ్లీ 'దేశద్రోహులు' అనిపించుకున్నారు. దానివల్ల, తెభాగావంటి బలమయిన రైతాంగపోరాటం నడిపిన బెంగాల్‌లోనే, ఆ పోరాటం ఆగీ ఆగక ముందే అదే జిల్లాలలో హిందూముస్లిం మతకలహాలు పెల్లుబికినప్పుడు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. సుభకూ శాంతంకూ తమ పార్టీవైఖరి వివరిస్తూ అమృతవల్లి ప్రదర్శించిన దృఢత్వం కల్పితమయినదే.

ఈ లోపాన్ని మినహాయిస్తే, ఆ కాలపు సంశయాలనూ సందిగ్ధాలనూ నవల చక్కగా ప్రతిబింబిస్తుంది. లక్ష్మి, సుభ, శాంత, జనార్ధనం, సీతారాం, అమృతరావు, శాస్త్రి — నవలలోని పాత్రలంతా ఈ దశలో రాజకీయ చర్చలలోకి దిగుతారు. ఎవరి 'లైన్' ను వారు బలంగా సమర్థించుకుంటారు. ఏ లైనూ లేని సుభ, జనార్ధనం వంటివారు 'అదీ నిజమే ఇదీ నిజమే' అన్నట్టు సంకటంలో పడతారు. క్రమంగా ఏ నిర్ధారణకూ రాకుండ (కాంగ్రెస్ వారి జాతీమోద్యమం ముగిసినట్టే) నవల అంత మవుతుంది. మన జాతీయోద్యమం దాదాపు ఏ సమస్యనూ పరిష్కరించకుండా ముగిసింది. అందుకే కాబోలు నవలను ఎట్లా ముగించాలో తెలియక చవకబారు రొమాంటిక్ నవల లాగ ముగించారు లక్ష్మణరావుగారు. ఇది ఆయన శిల్పం మీద కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం.